

సబ్‌ట్రెజరీ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా ఖజానా అధికారి గణేశ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయనను కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. పెన్షనర్ సతీమణి పుట్టిన తేదీని సిఎఫ్ఎంఎస్‌లో నమోదు చేయాలని కోరారు. నర్సాపురం తాలూకా పెన్షనర్ల అసోసియేషన్ తరపున గణేష్‌కు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అత్మూరి నరసయ్య, సెక్రటరీ మీసాల సత్యనారాయణ, ట్రెజరర్ మానే సత్య నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.



అధికారిని సత్కరిస్తున్న సభ్యులు

స్థలం ఇల్లూ లేదు..!

నెరవేరని గ్రామీణుల సొంతింటి కల

స్థలమున్నవారు ఇల్లు కట్టుకునేందుకు ఎదురుచూపు

కూటమిలో కదలిక లేని గృహనిర్మాణం

సర్వేల పేరుతో కాలక్షేపమేనని జనం నిర్వేదం

పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థల హామీ అమలెప్పుడో



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ పేదలకు ఇళ్ల నిర్మాణం, స్థలాల మంజూరుకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో సొంతింటి కల నెరవేర్చుకోవాలన్న ఆశ సామాన్య కుటుంబాలకు అందని ద్రాక్షగా మిగిలింది. ముందుగా సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుంది. పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకునే అవకాశం కల్పించినప్పటికీ గ్రామాల్లో మాత్రం అటువంటి పరిస్థితి లేదు. సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.2.50 లక్షలు సాయం అందించనున్నట్లు ప్రకటించింది. కేంద్రం నుంచి రూ.లక్షన్నర, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వనుంది. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ నత్తనడకగా ముందుకు సాగలేదు. అంతేకాకుండా ప్రభుత్వం అందించే సాయం రూ.లక్షా 80 వేలకు కుదించింది. ఇసుక ధర ఆకాశాన్నంటింది. దీంతో ఇల్లు కట్టుకునేందుకు జనం భయపడేవారు. కూటమి అధికారంలోకొచ్చాక ప్రభుత్వ సాయం పెంచడంతో ఇళ్లు కట్టుకునేందుకు సొంత స్థలం ఉన్నవారు చాలా మంది ముందుకొస్తున్నారు. గ్రామాల్లో ఇంకా గృహ నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొదలు కాలేదని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ముందుగా నిర్మించుకుంటే తర్వాత ప్రభుత్వ సాయం అందిస్తుందా అనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. అదేమని అడిగితే సొంత స్థలం ఉన్న కుటుంబాలపై సర్వే జరుగుతుందని చెబుతున్న పరిస్థితి ఉంది. 2014-19 టిడిపి పాలనలోనే ఇదే పరిస్థితి నెలకొంది. తొలుత మూడేళ్లపాటు ఇళ్ల నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా తర్వాత ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేసరికి 2019 ఎన్నికలు దగ్గరపడ్డాయి. టిడిపి ఓటమి పాలైంది. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గృహనిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో ఇళ్లు నిర్మించుకున్నవారు ఏలూరు జిల్లాలో 26 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 25 వేల మంది వరకూ ఉండగా రెండు జిల్లాల్లో రూ.81 కోట్లు బకాయి ఉందంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు సైతం ఆఖరులో ఇంటి నిర్మాణాలకు అవకాశం ఇచ్చి సొమ్ము చెల్లించకపోతే పరిస్థితి ఏమిటో అనే చర్చ సాగుతోంది. వెంటనే గ్రామీణ ప్రాంతాల్లో సొంతం స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందించాలని అంతా కోరుతున్నారు.

ఇంటి స్థలం హామీ నెరవేరేదెప్పుడో..

గత ప్రభుత్వం పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేసింది. చాలా లేఅవుట్‌లు ఊరికి దూరంగా ఉండటం, పల్లపు ప్రాంతాలు కావడంతో లబ్ధిదారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటి వరకూ అందుకు సంబంధించిన ప్రక్రియపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. స్థల సేకరణ వంటి ప్రక్రియ కూడా ఎక్కడా చేపట్టిన పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇంటిస్థలం హామీని ఎప్పటికి నెరవేరుస్తుందనే చర్చ జనాల్లో సాగుతోంది. ఇంకా అనేక కుటుంబాలకు ఇంటి స్థలం సైతం లేని పరిస్థితి ఉంది. అంతేకాకుండా వైసిపి ఇచ్చిన ఇంటిస్థలం ఎటూ చాలని పరిస్థితి ఉంది. వారికి కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇంటిస్థలం కేటాయించాలని లబ్దిదారులు కోరుతున్నారు. గత వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించడంతోనే ప్రభుత్వం సరిపెడుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చే ప్రయత్నాలు మాత్రం కనిపించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

దామోదరం సంజీవయ్య స్ఫూర్తితో సేవలు

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య స్ఫూర్తితో ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా పని చేసిన దామోదరం సంజీవయ్య సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయులన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజలకు సేవలందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు దేశంలో కార్మిక, విద్యాశాఖల్లో పలు సంస్కరణలు తీసుకొచ్చి రూపొందించిన చట్టాలు వివిధ తరగతుల ప్రజలకు ఎనలేని మేలు చేశాయన్నారు. డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో ఎవ్వరూ తక్కువ కాదని దృఢ సంకల్పం, చిత్తశుద్ధి, దీక్షాదక్షతలు ఉంటే ఎలాంటి పదవినైనా అధిరోహించవచ్చునని నిరూపించిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అన్నారు. ఆ మహనీయుని స్ఫూర్తిగా తీసుకుని అందరం పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి బి.రామాంజనేయరాజు, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి జి.గణపతిరావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖాధికారి బి.సుజాతరాణి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

21,907 కోళ్లు శాస్త్రీయ పద్ధతిలో ఖననం

యుద్ధ ప్రాతిపదికన కోళ్ల పూడ్చివేత పనులు - కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

కోళ్ల పూడ్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వేల్పూరు గ్రామంలోని రెడ్‌జోన్ పరిధిలో ఆరు కోళ్లఫారాల్లో 21,907 కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేశారన్నారు. కృష్ణానందం కోళ్లఫారంలో ఉన్న 7,591 గుడ్లు, 5,020 కిలోల మొక్కజొన్న, మూడు వేల కిలోల ప్రోటీన్ ఫీడ్, 8 వేల కిలోల షెల్ గ్రిడ్, 10,074 కిలోల నూకల తౌడును శాస్త్రీయ పద్ధతిలో భూమిలో నిక్షిప్తం చేసినట్లు చెప్పారు. కోళ్ల షెడ్లను కెమికల్స్‌తో డిస్‌ఇన్ఫెక్షన్ చేస్తున్నట్లు తెలిపారు. సూర్యరమణ కోళ్లఫారాల్లో ఉన్న గుడ్లు 17,078, 4,860 కిలోల మొక్కజొన్న, 72,600 కిలోల నూకల తౌడు, 13 వేల కిలోల షెల్ గ్రిడ్‌లను కూడా శాస్త్రీయ పద్ధతిలో పశు వైద్య సిబ్బంది, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ సిబ్బంది సమక్షంలో భూమిలో శాస్త్రీయ పద్ధతిలో నిక్షిప్తం చేయనున్నట్లు వివరించారు. ఇన్ఫెక్షన్ జోన్‌లోని కోళ్లఫారం రైతులు తమ కోళ్ల ఫారాలను పశువైద్య సిబ్బంది సమక్షంలో పూర్తి స్థాయిలో బాధ్యతతో శుభపరచుకోవాలని తెలిపారు.

తణుకు రూరల్: తణుకు మండలం వేల్పూరులో కృష్ణానందం పౌల్ట్రీ ఫారంలో వైరస్ సోకిన కోళ్లను శాస్త్రీయ పద్ధతుల్లో పూడ్చి పెట్టారు. అనంతరం శుక్రవారం రాపిడ్ రెస్పాన్స్ టీముల ఆధ్వర్యంలో డిస్‌ఇన్ఫెక్టెడ్ శానిటేషన్ ప్రక్రియ చేపట్టినట్లు పశు వైద్యాధికారి కె.శంకరం భావనారాయణ తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కె.మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో 135 పరీక్షా కేంద్రాలు


హాజరు కానున్న 24,909 మంది విద్యార్థులు

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మార్చి 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు పదో తరగతి రెగ్యులర్, మార్చి 17 నుండి 28వ తేదీ వరకు ఓపెన్ స్కూల్స్ విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి పది పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెగ్యులర్, ప్రయివేటు కలిపి జిల్లాలో 128 కేంద్రాల్లో 24,393 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఓపెన్ స్కూల్స్ నుండి రెగ్యులర్, ప్రయివేటు మొత్తం 516 మంది విద్యార్థులకుగానూ ఏడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 135 కేంద్రాల్లో 24,909 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఈ పరీక్షలు కట్టుదిట్టంగా, ఎక్కడా కాపీయింగ్ జరగకుండా చూడాలని ఆదేశించారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్, నెట్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులను, తాగునీరు, పారిశుధ్యం పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్లను, డిపిఒను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్షల సమయంలో అవసరమయ్యే బస్సులను నడపాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, డిఇఒ ఇ.నారాయణ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం.సత్యనారాయణ, ఆర్ఐఒ వి నాగేశ్వరరావు, డిపిఒ బి.అరుణశ్రీ, డిఎంహెచ్ఒ భానునాయక్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్‌టిసి, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

జెఇఇలో తిరుమల విద్యార్థుల ప్రతిభ


ప్రజాశక్తి - భీమవరం టౌన్

జెఇఇ మెయిన్స్-2025 పరీక్షా ఫలితాల్లో భీమవరం తిరుమల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడం ఉభయ గోదావరి జిల్లాలకే గర్వకారణమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో ఆ విద్యార్థులను ఎంఎల్ఎ అంజిబాబు సత్కరించారు. జిల్లాలోనే మొదటి నాలుగు స్థానాలు సాధించిన భీమవరం తిరుమల విద్యార్థి పిజె.హర్షవర్ధన్ 99.76 పర్సంటైల్, ఎ.శివకార్తీక్-99.74, జి.వెంకట్-99.18, ఎం.సాయిచరణ్-99.03 పర్సంటైల్ సాధించారు. నలుగురు 99.5 పర్సంటైల్, ఏడుగురు 99 పర్సంటైల్, 17 మంది 98 పర్సంటైల్, 43 మంది 95 పర్సంటైల్, 64 మంది 93 పర్సంటైల్, 105 మంది 90 పర్సంటైల్ సాధించడం గొప్ప విశేషమని అంజిబాబు అన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఎఒ రంగాశ్రీనివాస్, పొత్తూరి బాపిరాజు, చెరుకువాడ రంగసాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల నడుమ ప్రేమికుల దినోత్సవం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రేమికుల దినోత్సవం అంటే ఎక్కడైనా ప్రేమికులు జరుపుకోవడం కన్పిస్తుంది. అయితే నరసాపురంలో ఆర్‌డిఒ దాసి రాజు మాత్రం తన కార్యాలయ సిబ్బందితో కలిసి వినూత్నంగా పేదల మధ్య ప్రేమికుల దినోత్సవం జరుపుకున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆదరణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆర్‌డిఒ కేక్ కట్ చేసి పేదలకు పంచడంతోపాటు వారికి బట్టలు, పళ్లు పంపిణీ చేశారు. ప్రేమికుల దినోత్సవం అంటే ప్రేమికులు జరుపుకునే రోజు మాత్రమే కాదని, ప్రేమను పేదలతో పంచుకోవడం కూడా అని దాసి రాజు అన్నారు. ప్రేమికుల రోజును పేదల మధ్య జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. 2015 నుండి తాను ఎక్కడ ఉద్యోగం చేసినా అక్కడ పేదల మధ్య ప్రేమికుల దినోత్సవం జరుపుకోవడం, వారి స్థితిగతులను తెలుసుకుని వారి జీవనం సుఖమయం చేయడమే తన ఉద్దేశమని ఆయన చెప్పారు. ప్రేమికుల దినోత్సవం అనేది యువతీ యువకులు జరుపుకునేది మాత్రమే కాదని, సమాజంలో అట్టడుగువర్గాల వారు, పేదలతో కూడా జరుపుకోవచ్చని అన్నారు. తహశీల్దార్ రాజేశ్వరి మాట్లాడుతూ ఇటువంటి వినూత్న కార్యక్రమాల ద్వారా పేదలకు సహాయ పడటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, ఆదరణ ట్రస్ట్ ఛైర్మన్ బొడ్డు కృష్ణ భగవాన్, సచివాలయ ఉద్యోగులు మాధురి, మదన్‌మోహన్ పాల్గొన్నారు.



వృద్ధుల మధ్య ప్రేమికుల దినోత్సవం జరుపుతున్న ఆర్‌డిఒ

ధన్యజీవి బులిరామయ్య : ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

పారిశ్రామికవేత్తగా, రాజకీయవేత్తగా ఎనలేని సేవలందించిన ధన్యజీవి మాజీ కేంద్ర మంత్రి బోళ్ల బులిరామయ్య అని, ఆయన తణుకుతోపాటు ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. బులిరామయ్య ఎనిమిదో వర్ధంతిని శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఎంఎల్ఎ బులిరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా పనిచేసి ఈ ప్రాంత అభివృద్ధిలో తన ముద్ర వేసుకున్నారన్నారు. సాంకేతిక రంగంలో ఆంధ్రాసుగర్స్‌ను ఉన్నత స్థానంలో నిలబెట్టిన ఘటన బులిరామయ్యదేనన్నారు. పారిశ్రామికవేత్తగా ఎంతోమందికి ఉపాధి కల్పించి ఎన్నో అవార్డులను అందుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ముళ్లపూడి వెంకటకృష్ణారావు, టిడిపి పట్టణాధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బులిరామయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

పేదల ఇళ్ల తొలగింపు విరమించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలోని గణపతిరాజు నగర్‌లో ఉన్న పేదల ఇళ్లను తొలగించాలని చూడటం అన్యాయమని, తక్షణం ఈ చర్యలను విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అన్నారు. శుక్రవారం సిపిఎం బృందం గణపతినగర్‌లోని పేదల ఇళ్లను సందర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా గణపతిరాజునగర్‌లో 30 పేదల కుటుంబాల పేదలు జీవిస్తున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ స్వలాభం కోసం పేదలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. పేదలను భయభ్రాంతులకు గురి చేస్తూ ఇళ్లు తొలగించాలని హెచ్చరికలు జారీ చేసి రెడ్‌మార్కులు పెట్టడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకొని పేదల ఇళ్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పేదల పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులతోపాటు సిపిఎం నాయకులు డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న వాసుదేవరావు

కేంద్ర బడ్జెట్‌పై నేడు నిరసన

వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదల వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను నిరసిస్తూ శనివారం ఉదయం పది గంటలకు స్థానిక ప్రకాశం చౌక్‌లో చేపట్టిన నిరసన, ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా శనివారం భీమవరంలో నిర్వహించే ఆందోళనలపై శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, కార్పొరేట్ ఆస్తులు పెంచే బడ్జెట్ అని నిప్పులు చెరిగారు. ఉపాధి హామీకి బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం దారుణమని విమర్శించారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి లేబర్ కోడ్‌లు తీసుకురావడం దారుణమన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయింపులు లేకపోయినా టిడిపి, జనసేన నోరెత్తకపోవడం దారుణమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ ఉపాధి హామీ, నిర్మాణ, వ్యవసాయ రంగాలకు, పరిశ్రమలకు కేటాయింపులు తగ్గించిన నిర్మలా సీతారామన్ ప్రజా బడ్జెట్ అని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఎంసిపిఐ(యు) జిల్లా నాయకులు జి.రాంబాబు, పట్టణ కార్యదర్శి కె.మహంకాళి, ఫార్వర్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాస్‌రాజు మాట్లాడగా నేతలు కనుమూరి వెంకటపతిరాజు, దుగ్గిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిబంధనలు మీరి చెరువులు తవ్వితే ఉపేక్షించం

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

నిబంధనలకు విరుద్ధంగా పంట, మురుగు కాలువలను ఆక్రమించి ఆక్వా చెరువులు తవ్వేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఉండి ఎంఎల్ఎ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు హెచ్చరించారు. శుక్రవారం మహాదేవపట్నంలో ఆక్వా చెరువు తవ్వకందారులు నిబంధనలకు విరుద్ధంగా బోదెలను ఆక్రమిస్తున్నారని సమీప రైతులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన రఘురామకృష్ణంరాజు చెరువు తవ్వకం ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. చెరువు తవ్వకాన్ని నిలిపివేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువులు ఎవరైనా తవ్వితే వాటిని ధ్వంసం చేస్తామని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిబంధనలు పాటించకుండా చెరువులు తవ్వడం వల్ల ఆక్వా వ్యర్థ జలాలు పంట కాలువలో కలిసి నీరు కలుషితమవుతుందన్నారు. ఆ కలుషిత నీరు తాగడం వలన ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారు. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వీటి జోలికి రాకపోవడం వల్ల పంట, మురుగు కాలువలు ఇప్పటికే పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయన్నారు. వాటికి స్వస్తి పలికి నిబంధనలు పాటించకపోతే సహించేది లేదని హెచ్చరించారు. పంట కాలువకు ఆనుకుని సుమారు 12 అడుగుల రహదారి ఉంటుందని, తర్వాత మూడు మీటర్లు వదిలి నూతనంగా చెరువులు తవ్వకం సాగించాలని చెప్పారు. ఇప్పటికే చెరువులు ఉన్నవారు సాగు పూర్తయిన వెంటనే నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని చెరువులు ధ్వంసం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, ఉండి డిసి ఛైర్మన్ తోట ఫణిబాబు, ఉపాధ్యక్షులు మంతెన సాయిలచ్చిరాజు, టిడిపి మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

చేప ధరలకు రెక్కలు..!

బర్డ్‌ఫ్లూతో తగ్గిన చికెన్ ధరలు - నిషేధం ఉన్నా కొనసాగుతున్న అమ్మకాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

చికెన్ అమ్మకాలపై గోదావరి జిల్లాల యంత్రాంగం నిషేధం విధించడంతో చేపలు, మటన్, రొయ్యల ధరలకు రెక్కలొచ్చాయి. చికెన్ ధరలు తగ్గాయి. గత కొన్ని రోజులుగా బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందుతోంది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై చికెన్ అమ్మకాలపై నిషేధం విధించడంతో చేపల ధరలకు రెక్కలు వచ్చాయి. కిలో రూ.140 నుంచి రూ.160 ఉండగా ప్రస్తుతం రూ.200లకు పైగా అమ్ముతున్నారు. దీంతో ముక్క లేనిదే ముద్ద దిగని మాంసాహార ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్ చికెన్‌ను నిషేధించినా ఇంకా పట్టణంలో చికెన్ అమ్మకాలు సాగుతున్నాయి. రెస్టారెంట్లలో కూడా చికెన్‌తో కూడిన కూడిన ఆహార పదార్థాలను యథాతథంగా విక్రయిస్తున్నారు. ఇంకా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం లేదు.



పదిలో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి

ఏలూరుపాడు జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.సత్యనారాయణ

చిట్ చాట్



ప్రజాశక్తి - కాళ్ల

పదో తరగతిలో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామని ఏలూరుపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.సత్యనారాయణరాజు తెలిపారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా విద్యార్థులకు ఇస్తున్న ప్రత్యేక తీర్ఫుదు గురించి హెచ్‌ఎం సత్యనారాయణరాజు ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఉందా?

హెచ్‌ఎం : గతంలో పది పరీక్షలు రోజుకొకటి చొప్పున నిర్వంచేవారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యేవారు. పండుగ, వారాంతపు సెలవులొస్తే తప్ప విరామం ఉండేది కాదు. అయితే రెండు పేపర్ల విధానం తొలగించి ఒక పేపరు విధానంతో పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పుడు పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు గడువు ఉంటోంది.

ప్రశ్న : మీ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు?

హెచ్‌ఎం: 66 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

ప్రశ్న : పదో తరగతి పరీక్షలు ఎప్పటి నుంచి జరుగుతాయి?

హెచ్‌ఎం : మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి పరీక్షకూ మధ్య ప్రభుత్వం ఒక రోజు విరామం ప్రకటించగా, గణితం, సాంఘికశాస్త్రం పరీక్షలకు అదనంగా మరో రోజు విరామం దొరికింది.

ప్రశ్న : ఈ సమయం పునశ్చరణకు అనుకూలమేనా ?

హెచ్‌ఎం: పది పరీక్షలకు ఒక్కో రోజు విరామం రావడం ఇదే తొలిసారి. ఈ సమయం ద్యార్థులు పూర్తిస్థాయిలో పునశ్చరణ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. దూర ప్రాంతాల విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి ఇంటికి చేరుకునేటప్పటికి సాయంత్రమవుతోంది. మర్నాడు మళ్లీ పరీక్షకు హాజరు కావాలంటే సహజంగా ఒత్తిడికి గురవుతారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. వారిలో ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలి.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



2కె వాక్ నిర్వహిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ఏటా చాలా మంది వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వి.ప్రసాద్, రమణ, ఎ.తేజ, ఎన్.సుబ్బలక్ష్మి అన్నారు. భీమవరం డిఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ, డిఎన్ఆర్ వాకర్స్, కాఫీ క్లబ్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 2కె వాక్ (మారథాన్) శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు చాలా మంది పాటించడం లేదన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, కారు నడిపేటపుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. డిఎన్ఆర్ కళాశాల జాయింట్ సెక్రటరీ రామకృష్ణంరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ బోండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేపట్టి 2కె వాక్ (మారథాన్) నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పుల్లారావు, సీతారామరాజు, ఆర్‌డిఒ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నత్తా రామేశ్వరంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఉదయం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.శామ్యూల్ పరిశీలించారు. గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీల హాజరు, పనుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, కార్యాలయ సిబ్బంది హాజరును, వారి పనితీరును పరిశీలించి, సకాలంలో విధులకు హాజరై పనితీరు మెరుగు పర్చుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.



భీమవరం టౌన్ : మాట్లాడుతున్న స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత

గొప్ప నాయకుడు సంజీవయ్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నిజాయతీకి మారుపేరు, గొప్ప నాయకుడు దామోదరం సంజీవయ్య అని సర్ సివి రామన్ స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత అన్నారు. శుక్రవారం శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సర్ సివి రామన్ స్కూల్లో దామోదరం సంజీవయ్య 104వ జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపల్ సరిత మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పనిచేసిన సంజీవయ్య జీవిత ప్రస్థానం ఆద్యంతం స్ఫూర్తిదాయకమన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడారు.

నరసాపురం : దళిత కుటుంబంలో జన్మించి ముఖ్యమంత్రి పదవిని అధిరోహించిన దామోదరం సంజీవయ్య యావత్ భారత దేశానికే ఆదర్శమని మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని అన్నారు. పట్టణంలోని 22వ వార్డు కొప్పినీడివారి సెంటర్లో పట్టణ మాల, కాపు నాయకులు సంయుక్తంగా సంజీవయ్య 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో కొత్తపల్లి నాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాల న్యాయ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు సోడదాసి శ్రీధర్, మాజీ ఎఎంసి ఛైర్మన్ దొండపాటి స్వాములు, కొప్పినీడి బాబాజీ పాల్గొన్నారు.

ముగిసిన మావుళ్లమ్మ ఉత్సవాలు

భీమవరం టౌన్:మావుళ్లమ్మ అమ్మవారి 61వ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) దంపతులు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను చేపట్టగా ఎంఎల్‌ఎ అంజిబాబు దంపతులు మహా నివేదనకు హారతులిచ్చి అన్న సమారాధనను ప్రారంభించారు. అనంతరం మహా నివేదన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, నేతలు పాల్గొన్నారు.

గ్రామాల్లో చెత్తనే సంపాదనగా మార్చాలి

తాడేపల్లిగూడెం:గ్రామాల్లో వృథాగా పడేసే చెత్త నుంచి సంపద తయారు చేసే విధంగా గ్రామాలు ప్రణాళిక వేసుకోవాలని మండల పంచాయతీల విస్తరణ అధికారి ఎం.వెంకటేష్ సూచించారు. మండలంలోని దండగర్ర, తదితర గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ముందు గ్రామాల్లో రోడ్ల పక్కన పడేసే పేడ, కుళ్లిన కూరగాయలు, ఇతర తడి చెత్త ప్రోసెసింగ్ చేయాలని సూచించారు. వాటితో పాటు వర్మీ తయారు చేసి ప్రజలకు రైతులకు తక్కువ ధరకే వర్మీ అందించి సేంద్రియ పద్ధతిలో సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు శివ, ఎంఆర్ సిఎం.రవి కిరణ్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి

తాడేపల్లిగూడెం:ప్రతి వాహనానికీ ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలని తాడేపల్లిగూడెం రవాణా యూనిట్ కార్యాలయ అధికారి డిఎస్.నాయక్ తెలిపారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు స్థానిక రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో శుక్రవారం వాహనాల ఇన్సూరెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డిఎస్ నాయక్ మాట్లాడుతూ లారీ, ఆటో, క్యాబ్ డ్రైవర్లు తమ వాహనాలకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆటో, లారీ, మ్యాక్సీ, క్యాబ్ ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నిద్రగన్నేరు వృక్షం..!

నరసాపురం:మండలంలోని ఎల్‌బిచర్ల పరిధిలో రామన్నపాలెం ఛానల్ కాలువను ఆనుకుని ఉన్న వందేళ్ల భారీ నిద్రగన్నేరు వృక్షం ఎండిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పక్కనే ఎండిన వృక్షం ఉంది. సమీపంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఉండడంతో విద్యార్థులంతా ఈ మార్గం గుండానే స్కూల్‌కు వెళ్తుంటారు. ఎండిన వృక్షం ఏ క్షణాన కూలి పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడుతుందోనని సమీపంలోని పంట చేలకు వెళ్లే రైతు కూలీలు ఆందోళన చెందేవారు. దీనిపై గ్రామ సర్పంచి గుబ్బల యమునా భాను స్పందించి భారీ వృక్షం కొమ్మలను కార్మికులతో తొలగించాలని అధికారులు కోరారు. ఈ మేరకు శుక్రవారం చెట్టు కొమ్మలను తొలగించారు. ఈ పనులను నాయకులు గుబ్బల భాను, ఉపసర్పంచి కటకంశెట్టి మామాజీ, పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మీపతి రాజు పర్యవేక్షించారు.

అమర జవాన్లకు ఘన నివాళి

పాలకొల్లు :పాలకొల్లులోని జివిఎస్‌విఆర్ ఎం మున్సిపల్ పాఠశాలలో పూల్వామా సంఘటనలో అమరవీరులైన జవాన్లకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం భవానీప్రసాద్ మాట్లాడుతూ పుల్వామ ఉగ్రదాడికి ఆరేళ్లు గడిచాయని చెప్పారు. ఈ ఘటనలో ఎంతో మంది సైనికులు అమరులయ్యారని తెలిపారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

19న భీమవరంలో ఆడిషన్స్

విజయ దేవరకొండ చిత్రంలో నటించే అవకాశం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 19వ తేదీన భీమవరం హోటల్ లీలా కృష్ణ గ్రాండ్‌లో సినిమా ఆడిషన్స్ జరుగుతాయని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ బండి రత్నకుమార్ తెలిపారు. శుక్రవారం భీమవరం పద్మాలయ థియేటర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మాతలు దిల్ రాజు, శిరీష్, దర్శకులు కొలా రవికిరణ్ (రాజావారు రాణి వారు ఫేం), హీరో విజయ దేవరకొండ నటిస్తున్న నూతన చిత్రంలో నటించే అవకాశాన్ని పొందొచ్చని తెలిపారు. ఈ చిత్రం షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభం కానుందని, ఉభయగోదావరి జిల్లాల పరిసర ప్రాంతాల్లో జరుగుతుందని, ఉభయగోదావరి జిల్లాల్లో ఆడిషన్స్ జరుగుతున్నాయని తెలిపారు. ఆడిషన్స్‌కు 5 నుంచి 14 ఏళ్ల బాలురు, 5 నుంచి 12 ఏళ్ల బాలికలు, 25 నుంచి 65 ఏళ్ల పురుషులు, మహిళలు పాల్గొనవచ్చని తెలిపారు. ఆడిషన్స్‌లో పాల్గొనేవారు ఏ విధమైన రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, నటన పట్ల ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలకు టీవీ అందజేత

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జల్లికొమ్మర ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.50,000 వేలు విలువచేసే స్మార్ట్ టీవీని బహూకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కటకం సుందర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా టీవీని ప్రారంభించిన నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం లయన్స్ సభ్యులు టీవీని బహూకరించడం హర్షించ తగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఈపూరి సత్యనారాయణ, వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు, కె.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్‌సి వర్గీకరణపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ రాష్ట్ర ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ కోనా జోసెఫ్ అన్నారు. సిఎం రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తూ భీమవరం అంబేద్కర్ సెంటర్లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. జోసెఫ్ మాట్లాడుతూ మాదిగ, మాలలను విడగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాల సంఘాలు చేపట్టిన బంద్‌కు మద్దతు తెలియజేస్తున్నామని, వారికి మద్దతుగా భీమవరంలో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కెసి రాజు, జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్, మాత్తే రాజ్‌కుమార్, గంటా సుందర్ కుమార్, గాతల సందీప్, రాజశేఖర్, శేఖర్, మీసాల జయరాజ్ పాల్గొన్నారు.

కాళ్లలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కాళ్ల

ఒక వ్యక్తి ఇచ్చిన రక్తం ముగ్గురు జీవితాలను కాపాడుతుందని ఎంఇఒ ఎ.రవీంద్ర అన్నారు. కాళ్లలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ బ్రాంచి, భీమవరం ఛైర్మన్ మంతెన శివరామ బద్రిరాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంఇఒ రవీంద్ర రక్తదాన ఆవశ్యకతను, అవసరాన్ని వివరించారు. కాళ్ల, ఆకివీడు ఎంఇఒ ఎ.రవీంద్ర, ఉండి ఎంఇఒ జ్యోతి, ఆకివీడు ఎంఇఒ-2 సీతారామయ్య ముఖ్య అతిథులుగా బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల, ఆకివీడు, ఉండి మండలాలకు చెందిన సుమారు 28 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డి.ప్రసన్నభారతి, బిఆర్‌ఎంకె.స్వామి, ఎల్.అప్పలాచార్యులు, బి.నర్సింహస్వామి, ఎన్‌ఎ.నరసింహరాజు పాల్గొన్నారు.

ఉడికించిన కోడి గుడ్లు, మాంసం తినొచ్చు

ప్రజాశక్తి - ఉండి

బర్డ్ ఫ్లూ నేపథ్యంలో బాగా ఉడికించిన కోడిగుడ్లు కోడి మాంసం తినొచ్చునియండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బిన్నీ శామ్యూల్ అన్నారు. శుక్రవారం వెలివర్రులో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శామ్యూల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకూ చికెన్ కోడిగుడ్లు జోలికి వెళ్లకుండా ఉండటం మంచిది అని తెలిపారు. ఉండి మండలానికి అలర్ట్ జోన్ లేకపోవడంతో మాంసంప్రియులు బాగా ఉడికించిన కోడిగుడ్లు మాంసం తినడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని సూచించారు. అనంతరం రోగులను పరీక్షించి వారికి కావాల్సిన మందులను ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆక్వా దుకాణాలకు రూ.11 లక్షలు జరిమానా

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆక్వా దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి మొదటి తప్పుగా క్షమించి స్వల్ప ఫైన్ వేశారనే విమర్శలు వచ్చినట్లు శుక్రవారం ప్రజాశక్తి పేపర్లో వచ్చిన కథనానికి మత్స్య శాఖ జిల్లా అధికారి ప్రసాద్ వివరణ ఇచ్చారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ నాగరాణి ఆయా షాపుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. భీమవరం మండలం చినఅమిరం గ్రామంలో బుధవారం విజిలెన్స్ అధికారులు దాడి చేసి రూ.రెండు కోట్ల 20 లక్షల స్టాక్‌ను సీజ్ చేశారని అన్నారు. అయితే సీజ్ చేసిన తర్వాత స్టాక్ వివరాలతోపాటు షాపు తాళాలు కూడా తమకు ఇవ్వాల్సి ఉందని కానీ అలా చేయలేదన్నారు. దీంతో రాను షాపుల్లో కేవలం రొయ్యలు, చేపలకు సంబంధించి మందులే ఉన్నాయనుకున్నానని, కానీ ఫీడ్ మేతలు కూడా ఉన్నాయని దీంతో ఒక్కొక్క షాపుకు ఫీడ్‌కు సంబంధించి రూ.5 లక్షలు, మందులకు సంబంధించి రూ.50,000 చొప్పున రెండు షాపులకు రూ.11 లక్షలు ఫైన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ ఫైన్ జిల్లా కమిటీ ఆమోదంతో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే జిల్లాలో ఆక్వా ఫీడ్, మందుల షాపులు ఎన్ని ఉన్నాయని ప్రశ్నించగా 268 షాపులు ఉన్నాయని తెలిపారు. 2022 అప్పడా నిబంధనల మేరకు షాపు యజమానులు రూ.50,000 ప్రభుత్వానికి చెల్లించి లైసెన్స్ పొందాల్సిన ఉందని కానీ ఇప్పటివరకూ అతి తక్కువ మంది ఈ లైసెన్స్ తీసుకున్నారని, ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాజశేఖరంను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు 9వ వార్డులో, డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల, కోకోనట్ మర్చంట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌కెపిటివిఆర్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. పాలకొల్లు నియోజకవర్గ పరిశీలకుడు మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో నాయకులు పట్టభద్రులను కలిసి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, మహమ్మద్ జానీ పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ పుట్టినరోజు

ప్రజాశక్తి - తణుకు

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, తణుకు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, మాజీ వార్డు కౌన్సిలర్, విద్యా సంస్థల అధినేత బసవా రామకృష్ణ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం తణుకు సజ్జాపురంలోని ఆదర్శ కాన్సెప్ట్ స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ రాజకీయ రంగంతోపాటు విద్యారంగం, సేవా సంఘంలో రామకృష్ణ ఎన్నో ఏళ్లుగా తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ, 25 మంది హెచ్‌ఐబి బాధిత పిల్లలకు బ్యాంకు ఖాతాలు ప్రారంభించి వారికి ప్రతినెలా ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం రామకృష్ణను ఎంఎల్‌ఎ రాధాకృష్ణ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి నేతల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆంధ్రప్రదేశ్‌ను ఇండస్ట్రీ హబ్‌గా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 33వ వార్డు పుంతలో ముసలమ్మ గుడి నుంచి ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు పింఛను అందజేత

ప్రజాశక్తి - నరసాపురం



పింఛను అందజేస్తున్న సభ్యులు

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు ఫౌండేషన్ ద్వారా ప్రతి నెలా పేదలకు పెన్షన్ అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఫిబ్రవరిలో పెన్షన్లు శుక్రవారం కొవ్వలి ఫౌండేషన్ ప్రెసిడెంట్ నిమ్మకాయల గోపాలరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంకు భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల అమ్మవారి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మావుళ్లమ్మ లడ్డూ వేలం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మావుళ్లమ్మ అమ్మవారి లడ్డూను పట్టణానికి చెందిన జనసేన నాయకుడు పడమటి రామకృష్ణ రూ.లక్షా పది వేలకు దక్కించుకున్నారు. శుక్రవారం అమ్మవారి అఖండ అన్న సమారాధనలో భాగంగా ఆలయం వద్ద నిర్వహించిన అమ్మవారి లడ్డూ పాటలో పలువురు పాల్గొనగా రామకృష్ణ రూ.1,10,000కు పాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, చలమలశెట్టి చంద్రశేఖర్, నీరుల్లి పండ్ల వర్తక సంఘం ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గాపురంలో ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు, వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు దుర్గాపురం ట్రస్టు ఆఫీసులో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో బిపి, షుగర్, బ్లడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. అవసరమైన పేషెంట్లకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు ఎబిఎస్‌విఎకె ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం తెలిపారు. ఈ క్యాంపులో ఎంబిబిఎస్ జనరల్ సర్జన్ పి.సత్యనారాయణరాజు పాల్గొని సేవలందిస్తారన్నారు.

కొనసాగుతున్న తహశీల్దార్ తనిఖీలు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో పలుచోట్ల తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ వంటపాటి ఆంజనేయులు బృందం పలు అంశాలపై తనిఖీలు సాగిస్తున్నారు. మూడు రోజు శుక్రవారం తనిఖీల్లో భాగంగా రైస్ మిల్లులు, వంట గ్యాస్ రాయితీ లబ్ధి విషయాలపై ఆరా తీశారు. రైస్ మిల్లులో ఈ సంవత్సరం మిల్లులు చేసిన క్లస్టర్ మిల్లింగ్ రైస్ ప్రొక్యూర్మెంట్ పరిస్థితిపై ఆరా తీశారు. ప్రభుత్వానికి ధాన్యం మరపట్టి ఇవాల్సిన బియ్యం రికార్డులను తనిఖీ చేసినట్లు చెప్పారు. ఇప్పటికీ ఈ రకంగా రెండు రైస్ మిల్లులు తనిఖీ చేశారు. వంట గ్యాస్ వినియోగదారులకు ప్రభుత్వం నుంచి రాయితీ లభించిందా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. ఆ మేరకు రికార్డులను పరిశీలించారు. స్థానిక హెచ్‌పి గ్యాస్ డీలర్ ఎంఆర్‌కె రికార్డులను పరిశీలించినట్లు చెప్పారు. బర్డ్ ఫ్లూ సమస్యలపై పట్టణంలో పుకార్లు షికార్లు చేస్తున్న పరిస్థితుల్లో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి కోడి మాంసం అమ్మొద్దంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించాలి

ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ లక్ష్మీకాంతం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ కె.లక్ష్మీకాంతం సూచించారు. స్థానిక చినరంగానిపాలెం హైస్కూల్‌లో, వెంప గ్రామంలో జరుగుతున్న పోషణ్ బి పడాయ్ బి అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమం శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన లక్ష్మీకాంతం మాట్లాడుతూ నేటికీ గ్రామాల్లో గర్భిణులు సరైన పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనతతో శిశువులు పుట్టి అనేక అనారోగ్య సమస్యలకు గురవుతారన్నారు. ప్రతి ఒక్కరూ పోషక ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరళ, కనకమహాలక్ష్మి, అనిలా కుమారి పాల్గొన్నారు.



పాలకోడేరు : మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ సుజాత రాణి

పాలకోడేరు : అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, దాని విశిష్టతపై ప్రతి ఒక్కరికీ చాటి చెప్పాలని ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి అన్నారు. ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డబ్ల్యూడిసిడబ్ల్యూ ఆధ్వర్యంలో పోషణ్ బి పడాయ్ బి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ పీడీ సుజాతారాణి హాజరై సిబ్బందికి పలు సూచన సలహాలు అందజేసి మాట్లాడారు. తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, తీసుకోకపోతే ఏర్పడే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. శిక్షణ తరగతుల్లో సూపర్‌వైజర్ కె.సూర్య కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆచంట : ఆరేళ్లలోపు చిన్నారులకు విధిగా పౌష్టికాహారం అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో మూడు రోజులపాటు అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ బి పడయ్ బి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : చిన్నారుల్లో పౌష్టికాహారం లోపం రాకుండా అంగన్వాడీలు శ్రద్ధ తీసుకోవాలని సిడిపిఒ బి.ఊర్మిల సూచించారు. పోషణ్ బి పడాయ్ బిపై మూడు రోజుల శిక్షణ తరగతులను మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. రెండో రోజు శుక్రవారం చిన్నారుల్లోని పౌష్టికాహార లోపంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రమశంకర్ పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామం, చెరుకువాడ కి చెందిన రాపాక మురళి, తండ్రి: వెంకటేశ్వర్లు అను నేను నా యొక్క డాక్యుమెంట్ పడిపోయింది. జిరాక్స్ సెంటర్ నుండి ఇంటికి వెళుతుండగా నా యొక్క డాక్యుమెంట్ పడిపోయింది. నా యొక్క **డాక్యుమెంట్ నెం. 3752/2017** గల డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

రాపాక మురళి
తండ్రి : వెంకటేశ్వర్లు
డోర్ నెం : 33-26
చెరుకువాడ, పెనుగొండ,
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా
సెల్: 90569 576613

పాస్‌పోర్టు పోయినది

పోడూరు మండలం, మట్టపర్రు గ్రామం, డోర్ నెం. 5-21, పెదపాలెం, మట్టపర్రు గ్రామం, ప.గో.జిల్లా, ఏ.పి కి చెందిన పెచ్చెట్టి శివబాబు, తండ్రి: వెంకట రమణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి ది. 26-11-2019 న **U1849548 నెంబర్, పాస్‌పోర్ట్** తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ను ది. 07-02-2025 న తీసుకొని మట్టపర్రు లోని మా ఇంటి నుంచి జిన్నూరు జిరాక్స్ సెంటర్ కు బైకు పై వెళ్ళగా నేను వైజాగ్ లో పొందిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దారిలో పడి పోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్ కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా సెల్ నెం: 98492 95891

పాస్‌పోర్టు పోయినది

అత్తిలి మండలం, కొమ్మరగ్రామం, డోర్ నెం. 2-8/1, ప.గో.జిల్లా, ఎ.పి కి చెందిన మంతెన సత్యనారాయణ రాజు తండ్రి: గోపాలరాజు ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి ది. 05-01-2015 న **M5297694 నెంబర్, పాస్‌పోర్ట్** తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ను ది. 07-02-2025 న తీసుకొని పోడూరు లోని మా బావగారి ఇంటికి పాస్‌పోర్ట్ గురించి చర్చించడానికి వెళ్ళి అక్కడకు సమీపంలోని కవిటంలో జిరాక్స్ సెంటర్ కు బైకు పై వెళ్ళగా నేను వైజాగ్ లో పొందిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దారిలో పడి పోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా అడ్రస్‌కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా సెల్ నెం: 91777 22333

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

ఐ.పి.నెం.4/2025

వెదురుపర్తి మోజెస్ నారాయణ, S/o. సూర్యనారాయణ, డోర్. నెం. 10-5-2/1, ముమ్మిడివారి వీధి, నరసాపురం, ప॥గో॥జిల్లా. **...పిటీషనర్**

మరియు

1. M/s. శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, నరసాపురం బ్రాంచ్, Rep.by its మేనేజర్ కమ్ GPA హోల్డర్ శ్రీ జి.డి. జగదీష్, ఆంధ్రాబ్యాంక్ రోడ్, నరసాపురం, ప॥గో॥జిల్లా.
2. ఆఫీషియల్ రిసీవర్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు. **...రెస్పాండెంట్స్**

పై నెంబరు ఇన్సాల్వెన్సీ లో పిటీషనర్ 1వ రెస్పాండెంట్ కు చెల్లించవలసిన బాకీ చెల్లించలేని పరిస్థితిలో పిటీషనర్ తనను దివాళా కోరు దారునిగా డిక్లేర్ చేయమని కోరుచూ పై నెంబరున ఇన్సాల్వెన్సీ పిటీషన్ దాఖలు చేసుకొని యున్నాడు. మరియు సదరు ప్రొవిన్సియల్ ఇన్సాల్వెన్సీ యాక్ట్ అండర్ సెక్షన్ 31 ప్రకారం ఇంటీరియమ్ ప్రొటక్షన్ ఆర్డరు కూడా పొందియున్నారు. దానిపై శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం 1,2 రెస్పాండెంట్లకు గాని, మరి ఏ ఇతరులకు గాని సదరు పై నెంబరు పిటీషన్ లో ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **ది. 28-02-2025 సం.రం. తేదిన ఉదయం గం. 10-30 ని.లకు** శ్రీ కోర్టు వారి యెదుట స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై పై పిటీషన్ నందు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేని యెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడునని దరిమిలా వచ్చే ఆక్షేపణలు ఏమి పిటీషనర్లను బైండ్ చేయవని యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.వారి పరోక్షమున తీర్పు గావింతురు అని తెలియజేయడమైనది.

కామన బాల సత్యనారాయణ
నరసాపురం — పిటీషనర్ తరపు అడ్వకేట్
ది.14-02-2025 — నరసాపురం

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P.No. 6/2023

Between:
Petitioner:
Emana Ramanjaneyulu, S/o. Tataiah, R/o. Kanuru Village, Machilipatnam Mandal, Krishna District.

And

Respondents:
1. Parasa Mulaswamy, S/o Peddiraju, R/o. D.No. 1-4, Parasavari Meraka, Turputallu Village, Narsapuram Mandal, West Godavari Distict.
1. Parasa Nagaraju, S/o Peddiraju, R/o. D.No. 1-4, Parasavari Meraka, Turputallu Village, Narsapuram Mandal, West Godavari Distict.

పై నెంబరు Insolvency Petition లో IP. No. 6/2023 రులో సదరు పై 1 & 2వ రెస్పాండెంట్లుకు చాలా కాలము నుండి బేటా కడుతున్నాము. అందున, శ్రీ కోర్టు వారు Dt. 10-1-25 Substitute Service Pablication ఆర్డరు ప్రకారము ఈ Pablication ద్వారా 1 & 2వ రెస్పాండెంట్లుకు తెలియపరచు విషయము అనగా **ది.21-02-2025వ తేదీన** సదరు 1 & 2వ రెస్పాండెంట్లు **ఉదయం గం. 10-00 గంటలకు** మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో హాజరు కావలెనని లేని యడల మీకు పరోక్షమున తీర్పు ఇచ్చెదరు. 1 & 2వ రెస్పాండెంట్లుకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

బొలిశెట్టి నవీన్‌కుమార్
నరసాపురం — అడ్వకేట్, నరసాపురం
ది.14-02-2025 — సెల్: 81797 05000